# బేవార్స్ గా(డు)రు!

'కథకి ఇదేం టైటిల్రా బాబూ?... పరమ బేవార్స్‌గా వుంది...' నా ఆత్మీయ మిత్రుడు రఘురాం చేసిన కామెంటిది.

'చూశావా... కథ వినకుండానే... టైటిల్ చూసి 'బేవార్స్'గా వుందనే కామెంట్ పాస్ చేసావే... తీరా ఈ కథ ఏ పత్రికలోనో అచ్చుకు నోచుకుంటే... కథని చదివే లక్షలాదిమంది పాఠకులు ఎలాంటి అభిప్రాయానికొస్తారో... నువ్వూహించలేవ్... అది నీవల్ల కాదు..." రిలాక్స్‌డ్‌గా సిగరెట్ వెలిగించాను (సారీ... ధూమపానం హానికరం...).

'అయితే ఇంకేం?... కథ కూడా చదివి నన్ను చంపెయ్... నీ కథ వింటానని కమిటై పోయానుగా...'

రఘురాం ముఖాన కూడా ఓ సిగరెట్ పడేసి ఏకబిగిన ఎనిమిది పేజీల కథని చదివి విన్పించాను.

కథవిన్నాక ఫ్రెండ్‌లో మార్పొచ్చింది!

'ఒరేయ్ భటాచోర్ నీవు విన్పించిన కథలో థీమ్ అద్భుతంగా వుంది. టైటిల్‌కి ఫుల్ జస్టిఫికేష నిచ్చావ్! నిజంగా... నేనంటున్నానని కాదుగానీ... నువ్వు టాలెంటెడ్ రైటర్‌వి! ముఖస్తుతి అనుకోకు... నువ్వు కథలో నేరేట్ చేసినట్టు మనచుట్టూ వున్న సమాజంలో బేవార్స్‌గాళ్ళెందరో... ఇలాంటివాళ్ళు మన కంట్రీలోనే కాదు... అసలీ భూమ్మీదే కోట్లకొద్దీ వున్నారన్పిస్తుంది. కథలో నీ హీరోకున్న క్వాలిటీస్ అనేకమందిలో చూస్తాం! కాకపోతే... ధైర్యంచేసి కథలో హీరోకి బేవార్స్ క్వాలిటీస్ అన్నీ పులమే ధైర్యం చేసావ్? హేట్సాఫ్ టు యూ రా!!...' పార్క్‌లో పచ్చగడ్డి మీద వెల్లకిలా పడుకుని ఫ్రాంక్‌గా మాట్లాడేడు రఘురాం!

'నీకథ ఒరేయ్ ఎలాంటి వారికైనా వచ్చినట్టు నచ్చి తీరుతుంది. మెచ్చుకోనివాడు మనిషే కాదు. నా దగ్గర బ్లాక్‌మనీ వుంటేగానొరేయ్... నీ ఈ స్టోరీని సర్వహక్కులతో కొనేసి... రాజేంద్రప్రసాద్‌నో... అల్లరి నరేష్‌నో పెట్టి... ఇ.వి.వి. సత్యనారాయణతో సిన్మా తీయించి జనంమీది కొదిలేవాడిని!... ఏం చేస్తాం?... నాకంత దమ్ములేదు...' పడుకున్నవాడల్లా లేచి కూర్చుని రఘురామే అన్నాడు.

అని వూరుకున్నాడా? లేదే...? ఓ.సీ.గా వచ్చేదే కదాని మరో సిగరెట్ కోసం చేయి చాచేడు.

'ఆఫ్టరాల్ నివ్విచ్చేది నే కాల్చేదీ ఒకటో రెండో సిగరెట్లు. ఇంతమాత్రానికే ఏదో ఇంపోర్టెడ్ విస్కీ ఫుల్ బాటిల్ దానం చేస్తున్నవాడికి మల్లే ముఖం పెట్టకు... నాకు చెడ్డ చిరాకు...'

'ఒరే ఫూల్! నువ్వు వూదిపారేసి బేవర్స్‌గా వచ్చిందేగా...?...'

'అలా డైలాగుల్తో దెబ్బకొట్టకు! నేనేం నీ కథలో హీరోలాంటోడిని కాను...' భుజాలు తడుముకున్నాడు.

'అదికాదు రఘురాం...'

'అయ్యబాబోయ్!... నీకు దొరికిపోయాన్రా బాబూ... వాడేయటం అపు! బుద్ధొచ్చింది. రేపటి నుండి ఓ.సీ.గా ఎవ్వరినుండీ ఏదీ ఆశించను. సరేనా!?' లెంపలేసుకుని లేచి నిలబడ్డాడు.

'ఇప్పుడు మనదారెటు?...' లేస్తూ అడిగాను.

'ఇంకెటు? ఇంత గొప్ప కథ రాసేవు... పోటీకి పంపిస్తే ప్రైజు లాగించగలవ్-... అప్పటిదాకా ఆగలేను కాని... అట్లా ఉమర్‌ఖయ్యాం బారుకు పోదాం పద... ఇద్దరం రిలాక్సవచ్చు...'

ఇద్దరం పార్కు బైటికొచ్చి ఆటో ఎక్కాం!

ఎవరికంటా పడకుండా ఓ మూలగ వున్న కుర్చీల్లో కూలబడ్డాం!

వాడు కోరింది ఆర్డరిచ్చాను! బిల్లు నేనే పే చేస్తాను! నువ్వేం వర్రీ అవకు.. హామీ ఇచ్చాను. రఘురాం ఆమాటకి తెగ సంబరపడ్డాడు.

రెండు రౌండ్లకే రఘురాంకి కిక్కెక్కిందో ఏమో 'నీ బేవార్స్ కథకి... సారీ... ఐ మీన్ కథ బేవార్సదని కాదు... ప్రైజ్ గ్యారంటీ. కావాలంటే స్టాంప్ పేపరు మీద రాసిస్తాను. అదీ చాలదనుకుంటే నోటరీ చేత అటెస్ట్ చేయిస్తాను. ఇంకా కావాలంటే రిజిస్టార్ ఆఫీసుల్లో రిజిస్టర్ చేయిస్తాను. ఓ.కే.నా!?...' బల్లగుద్ది మరీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లెవెల్లో మాట్లాడేడు రఘురాం!

'ఒరేయ్! సోది మాటలాపు! పైసా ఖర్చులేని వాగుడు దేనికి?...'

'అథవా... ప్రైజ్ రాకుంటే... ఆ మనీ ఏదో నేనిస్తాను... ఎగ్రీడా?...'

'నాదగ్గర కాఫీ... టీ... సిగరెట్లు... మందు వగైరాలకోసం అనుక్షణం నన్ను ఆశ్రయించే బేవార్సుగాడివి... నీ మాటలు నమ్మమంటావా?...'

'నువ్వేమైనా చెప్పు! నీ కథలో సామాజిక స్పృహ వుట్టిపడుతోంది. ఈ నిజాన్ని ఎవరూ కాదన్లేరు. అది నీకూ తెల్సు! నువ్వా చేయి తిరిగిన రైటర్‌వి. అవునా?!... రాసే ప్రతికథకీ పురిటినెప్పులు దేనికిరా?... బీ కాన్ఫిడెంట్...'

రఘురాం మాటలు అక్షర సత్యాలు! అందులో ఏమాత్రం అబద్ధంలేదని నా మనసుకూ తెల్సు!

నా స్టోరీలో హీరో... నాదస్వరం వూదుతూ రోడ్డు పక్కన పాములు ఆడించేవాడో... కోతిచేత ఫీట్స్ చేయించేవాడో... తీగెమీద కర్రసాయంతో నడిచేవాడో కాదు.

హీరోకి పేరులేదు. ఎవరికి ఎక్కడ ఎప్పుడు పుట్టేడో ఎవరికీ తెలీదు- అంటే బేవార్సుగా

భూమ్మీద పడ్డాడన్నమాట!

ఎండకు వానకు తడిసి పేవ్మెంట్మీద పెరిగాడు. పొట్టకూటికి... పిక్పాకెటింగ్... చైన్ స్నాచింగ్ వంటి విద్యలు నేర్చుకున్నాడు. కష్టపడకుండా ఓ.సీ.గా ఐ మీన్ బేవార్స్గా లోకుల సొమ్ముతో బతికేయటానికి అలవాటు పడ్డాడు.

పద్దెనిమిదేళ్ళకు ఓటుహక్కు సంపాదించుకున్న భారతీయుడిలా... యుక్త వయసు రాగానే చిన్నా చితకా పన్లకు 'బై' చెప్పి... టూ వీలర్స్... ఫోర్ వీలర్స్ నేకగా కాజేసి అమ్మి సొమ్ము చేసుకోవటానికి అలవాటు పడ్డాడు.

జేబులు కొట్టే ప్రాయంనుండే పోలీసులతో దోస్త్ ప్రారంభించిన వాడు కావటంతో... తాను ఏ పని చేస్తున్నా... ఎవరి వాటాలు వారికి ముట్టచెప్తూండటంతో... బేపర్వాగ తిరగ్గలుగుతున్నాడు.

స్కూటర్లు... కార్లు దొంగిలించే పని... రెండేళ్ళకే బోర్ కొట్టటంతో... రాత్రిళ్ళు షాపుల షెట్టర్లు ఎత్తేసి బంగారు దుకాణాల్లో సొమ్ములకు ఎసరుపెడుతూ వచ్చాడు.

చాకచక్యంతో చేస్తున్న చోరీలు...రాబరీల ద్వారా దోచుకున్న డబ్బు చాలా జాతీయ బ్యాంకు ఎకౌంట్స్లో మూలుగుతోంది.

పాతికేళ్ళకి పెళ్ళి చేసుకోవాలనే అయిడియా రాగానే... తానొక అనాథ కాబట్టి... మనసుకి నచ్చిన అంధురాలైన విద్యావంతురాలిని కావాలని... ఇష్టపడి పెళ్ళిచేసుకున్నాడు.

పెళ్ళిఅయిన క్షణంనుంచే ... దొంగతనాలకు గుడ్బై చెప్పి... రాజకీయాల్లో తలదూర్చి ఆసక్తిని పెంచుకున్నాడు.

స్టైల్ మార్చుకున్నాడు. భాష నేర్చుకున్నాడు. నాయకులకు విందులిస్తూ... వారి అండదండలతో... ఆశీస్సులతో పాలిటిక్స్లో సుస్థిరస్థానం సంపాదించుకోగలిగేడు.

అలా...అలా... ఎదిగి... ఎదిగి... ఒక్కో మెట్టు ఎక్కుతూ... బడానేతల దృష్టిలో పడి... ఎలక్షన్లో పోటీ చేయటానికి పార్టీ టికెట్టు సంపాదించుకున్నాడు.

ఎత్తుగడలు ఫలించి... ఓటర్ల ఆదరాభిమానాలతో శాసనసభకు ఎన్నికై...మంత్రి పదవి కైవసం చేసుకోగలిగిన అదృష్టవంతుడైనాడు.

హుఁ! ఎవరికి పుట్టినవాడో... అనాథగ పేవ్మెంట్లమీద పెరిగి... దొంగగామారి... ఎంతో సంపాదించి మంత్రి అయినాడు.

ఎక్కడో బేవార్స్గా పుట్టి... బేవార్స్గా పెరిగి తిరిగి... బేవర్స్పన్లు చేస్తూ.. బతికిన బేవర్స్గాడిని... (సారీ గారిని) ప్రజలు ఆదరించి అక్కున చేర్చుకుని... ఓట్లేసి ఎన్నికల్లో గెలిపించారు.

నాడు పేవ్‌మెంట్లు... నేడు ఏ.సి. బంగళాలు... ఏ.సి. కారు... గన్‌మెన్లు... వందిమాగధులు... పరువు మర్యాదలు... విందులు... విదేశీయానాలు... వాగ్దానాల మోతలు... చుట్టూ కాకాగాళ్ళు... పైరవీగాళ్ళు... బాకాగాళ్ళు... బాజాభజంత్రీగాళ్ళు... మెచ్చుకోళ్లు... ఊహకు అందని ఆదాయం... వచ్చే డబ్బు ఎక్కడ దాచుకోవాలో తికమకపడుతూ... వ్యాపారాలు... ఫ్యాక్టరీలు... మెడికల్ కాలేజీలు... ఇంజనీరింగ్ కాలేజీలు... అన్నీ తన స్వంతమే! తన పేరున వుంటే ప్రజలు గగ్గోలు పెడతారని భార్య పేరుతో నిర్వహించగల తెలివి పెరిగింది.

తాడితపీడిత ప్రజల కొరకే తాను పుట్టి... రాజకీయాల్లో కొచ్చాననటం నేర్చుకున్నాడు. బడుగు బలహీనవర్గాల ప్రయోజనాలకోసం... వారి వుద్ధరించటంకోసమే... తన చెమట... నెత్తురు... ధారపోయటానికైనా సిద్ధమంటున్నాడు.

పిచ్చి ప్రజలు... ఎవరేం చెప్పినా విని సంతోషించి... మోసపోవటానికి అలవాటు పడ్డారని వారికి తెలీదు.

ఏటా బ్రహ్మోత్సవాలకు కొండకెళ్ళే అలవాటు చేసుకుంటున్నాడు. స్వామివారికి బంగారు చెప్పులొకసారి నవరత్న ఖచిత ఆభరణాలు అర్పిస్తూ తనను చల్లగా పదికాలాలపాటు కాపాడమని వేడుకుంటున్నాడు.

తన్లాంటి బేవార్స్‌గాళ్లందరినీ ఆ దేవుడే కాపాడతాడు! భగవంతునిది సమదృష్టి! ఆయనకు తరతమ భేదాలుండవ్! దొంగనీ... దొరనీ... ఇద్దరినీ రెండుకళ్ళతో చూస్తాడు.

కథకి కొసమెరుపు హైలైట్.

అంగరంగ వైభవంగా పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని ఎస్కార్ట్‌తో వస్తున్న బేవార్స్ మంత్రిగారి కారు ఘోర ప్రమాదానికి గురై... వారితోపాటు గన్‌మెన్లు... కారు డ్రైవర్ స్పాట్‌లోనే చనిపోవటం... రాష్ట్ర ప్రజలు.. ప్రభుత్వం అత్యంత విషాదకరమైన దుస్సంఘటనగా... భావించి కన్నీటి వీడ్కోలు పలికారు.

అప్పటికి రాత్రి పదిగంటలు దాటింది.

బార్లోంచి ఇద్దరం బైటికొచ్చాం!

తెల్లారేక కథ ఫెయిర్ చేసి పోటీకి కొరియర్లో కవర్ బుక్ చేసాను.

- సమాప్తం -